# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ముఖ్యమైన పాత్రను పోషిస్తాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కేంద్రంగా త్వరలోనే రైల్వేజోన్ ఏర్పాటు చేయనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.**
2. **రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 23న అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో అనుమతి లేకుండా నడుస్తున్న అన్ని వసతి గృహలపైనా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వి అనిత హెచ్చరించారు.**
4. **తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ అభ్యర్థులకు త్వరలో ఉచితంగా డీఎస్సీ శిక్షణ అందిస్తామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి వెల్లడించారు.**

========================

దేశంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు–ఆర్ఆర్‌బి ముఖ్యమైన పాత్రను పోషిస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల పనితీరుపై సమీక్షించేందుకు నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఢిల్లీలో నిన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్యాంకులకు సంబందించిన కీలక సూచీలైన డిపాజిట్ వృద్ధి, క్రెడిట్–టు–డిపాజిట్ నిష్పత్తి, ఆస్తుల నాణ్యతపై కేంద్రమంత్రి సమీక్షించారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం సూర్య ఘర్, పీఎం విశ్వకర్మ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అమలైయ్యేలా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గ్రామీణ బ్యాంకులు స్వంత అత్యాధునిక సాంకేతికత వ్యవస్థను కలిగి ఉండాలని ఆర్థిక మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కేంద్రంగా త్వరలోనే రైల్వేజోన్ ఏర్పాటు చేయనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఆయన నిన్న ఢిల్లీలో మాట్లాడుతూ, రైల్వేజోన్ ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

పూర్తి సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు. అతిత్వరలోనే జోన్ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భూ కేటాయింపు, ఇతర అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారముందని చెప్పారు. ఇరు ప్రభుత్వాల అధికారుల మధ్య సానుకూలంగా చర్చలు జరిగాయని, జోన్ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు త్వరలోనే నెరవేరబోతున్నాయని పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ నెల 23న అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణ చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి అధికారులతో దృశ్యమాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం గ్రామ సభ నిర్వహణ, అందుకు సంబంధించిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పథకం పరిధిలో 46 రకాల పనులు చేపట్టవచ్చున్నారు. ఈ పథకం ద్వారా వేల కోట్ల నిధులు వెచ్చిస్తున్నామని, ప్రతి రూపాయిని బాధ్యతతో ఖర్చు చేసి. ఉపాధి హామీ పథకం లక్ష్యం అందుకోవాలని చెప్పారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి, మండల, గ్రామ స్థాయిలో ఉన్న అధికారుల వరకు పథకం అమలులో బాధ్యత తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా కోటవురట్ల వసతి గృహంలో ముగ్గురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర హోంశాఖ మంత్రి వి. అనిత స్పందించారు. విశాఖపట్నం ప్రభుత్వ ఆసుపత్రి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను ఆమె నిన్న పరామర్శించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, అనుమతి లేకుండా వసతి గృహాన్ని కొనసాగిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. కేవలం కోటవురట్ల వసతిగృహం మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో అనుమతి లేకుండా నడుస్తున్న అన్ని వసతి గృహాలపైనా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొంటూ..,

...వాయిస్ ( 29 సెకన్లు)

-------------------------

తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్న 'యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయంపై పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ క్రీడా పాఠశాలలు, అకాడమీలు, శిక్షణ సంస్థలన్నింటినీ క్రీడా విశ్వవిద్యాలయం పరిధిలోకి తీసుకువస్తామని తెలిపారు. ఒలింపిక్స్‌లోని ప్రతి క్రీడలో పతకాలు దక్కేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలని, దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ రాష్ట్రం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ అభ్యర్థులకు త్వరలో ఉచితంగా డీఎస్సీ శిక్షణ అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రాష్ట్ర సాంఘిక, సంక్షేమశాఖ అధికారులతో మంత్రి నిన్న సమావేశం నిర్వహించారు. ఈ

సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని జిల్లా కేంద్రాల్లో ఎస్సీ అభ్యర్థులకు మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విదేశీ విద్య పథకంతోపాటు 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో అమలైన అన్ని ఎస్సీ సంక్షేమ పథకాలనూ పునరుద్ధరిస్తామని చెప్పారు. మారుమూల ప్రాంతాల్లోని గురుకులాల్లో ఒప్పంద, పొరుగు సేవల ప్రాతిపదికన సిబ్బందిని నియమిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఫాక్స్‌కాన్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిందని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో నిన్న ఫాక్స్‌కాన్ బృంద ప్రతినిధులతో మంత్రి సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలను వారికి వివరించారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఈవీ, ఎలక్ట్రానిక్ విధానాలను తీసుకురాబోతున్నట్లు వెల్లడించారు. ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పరిశ్రమలకు రాయితీలు కల్పించే విధానం కూడా రూపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ వాహనాలు, సెమీ కండక్టర్లు, డిజిటల్, మ్యానుఫ్యాక్చరింగ్ భాగాల తయారీకి సంబంధించిన ఫాక్స్‌కాన్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజాప్రభుత్వంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ లక్ష్య సాధనలో ఫాక్స్‌కాన్ ప్రధాన భూమిక పోషించాలని మంత్రి ఆకాంక్షించారు. అనుమతుల నుండి ఉత్పత్తి వరకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని లోకేష్ పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో అర్హత ఉన్న ప్రతి రైతుకు కచ్చితంగా ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని జలసౌధలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, తెలంగాణ రైతులను రుణవిముక్తులను చేయాలని ప్రభుత్వం రుణమాఫీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. కోటి 20 లక్షల రైతు ఖాతాలకు ఆధార్ నంబర్లు సరిగా లేవని సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ జరగలేదని, వారికి కూడా రుణమాఫీ చేస్తామన్నారు. ప్రతి మండలంలో మండల వ్యవసాయాధికారులు రుణమాఫీ ప్రకక్రియలో సాంకేతిక ఈ సమస్యలను పరిష్కరిస్తారని మంత్రి తెలిపారు.

---------------------------

భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతిని ఈరోజు. జాతీయ "సద్భావనా దివస్"గా జరుపుకుంటున్నారు. 1944 ఆగస్టు 20న ముంబైలో జన్మించిన ఆయన 40 ఏళ్ల వయసులోనే భారత ఆరవ ప్రధానమంత్రిగా సేవలందించారు. 1984లో తన తల్లి ఇందిరాగాంధీ మరణానంతరం రాజీవ్ గాంధీ, ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆధునిక భావాలు, నిర్ణయాత్మక ఆలోచనలు కలిగిన రాజీవ్ గాంధీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీవారి శ్రావణ పౌర్ణమి గరుడ వాహన సేవ నిన్న వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్పస్వామివారు గరుడునిపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మరోవైపు.. అక్టోబర్ 4వ తేది నుంచి 12 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం -టిటిడి ఒక ప్రకటనలో వెల్లడించింది. తొమ్మిది రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలు అక్టోబర్ 3వ తేదీ సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమై అక్టోబర్ 12వ తేదీ ధ్వజావరోహణంతో ముగుస్తాయని పేర్కొంది.

====================